సెన్సేషన్ కథ

# అదే ఇది!

—పొట్టిముత్యాల వనజ

నవ్వింది...వాకిట్లో ముగ్గు పెడ్తూ...చిలిపిగా వెనుదిరిగి — నడుము వూపుతూ — అలా ఇంట్లోకెళ్లిపోయింది — వయ్యారంగా!

డంగైపోయాడు — సుబ్బారావు ప్రక్క పోర్షన్‌లోవున్న ఆమె నవ్వింది తనను చూసేనా... అన్న అనుమానంతో కొట్టుకులాడాడు. కుడితిలో పడ్డ ఎలుకలా — కొద్దిసేపు...

సభ్యత కాదని తెల్సినా — ఆమె గుమ్మం ముందు నించుని లోనికి తొంగి చూశాడు — కన్పడలేదు.

బహుశా! కిచెన్‌లో వుండి వుండొచ్చు. అయినా — నా పిచ్చిగానీ, సీక్రెట్ ఏదైనా మాట్లాడాలన్పిస్తే పెరట్లో వీలుగా వుంటుంది గానీ ముందు గుమ్మందగ్గర నిలబడి అందరూ చూసేలా ఎలా మాట్లాడుతుంది — పాపం!

అసలే ఇల్లాలాయే! ఆమె తెలివికి అబ్బురపడ్డాడు.

అప్పుడే — పెరట్లోని రోజా మొక్కకు నీళ్ల పోసేందుకు వస్తూ — చప్పుడవడంతో వెనుతిరిగి చూసి నవ్వింది. సుబ్బారావు కూడా మీసాల్లేని బోసి మొఖాన్ని చాటంత చేసుకుని — మరీ నవ్వాడు.

ఆమె అంతటితో వూరుకోలేదు — మరింత ప్రోత్సాహమిచ్చినట్లయింది — ఏదో... ఏదేదో చెప్పాలనే ఆరాటంతో — అతడికేసి రాసాగింది — మెల్ల మెల్లగా—

సరిగ్గా! అప్పుడే... ఏమండీ కాఫీ! పొద్దున్నే అక్కడేం చేస్తున్నారూ! మంచంమీదా లేరు — ముందు వాకిట్లోనూ లేరు — ఏమయ్యారనుకుంటూ ఇటొచ్చా — ఫుల్‌స్టాప్ లేకుండా లొడలొడా మాట్లాడేస్తూ మంచి పసందైన రసఘట్టంలో పానకంలో పుడకలా అడ్డురావడంతో చిరెర్రెత్తిపోయిందతడికి.

ఆమె దగ్గరికొస్తూ — "ఛీ ఛీ నీకసలు బుద్ధుందా! ఏం కొంపమునిగిందనీ — లేబర్ దానిలా నోరంతా వెళ్లబెట్టి అలా అరుస్తావ్! దేభ్యం మొహమా!

అప్పటివరకూ — భర్త అకాల ఆగ్రహానిక్కారణం బోధపడక — ఆశ్చర్యపోయి చూస్తున్న ఆమెకి—

అతడు ఆఖర్న ... తనను దేభ్యం మొహం అనగానే — కన్నెప్పలు తడి అయ్యాయి—

కొంగుతో కళ్లొత్తుకుంటూ — ఆ కాఫీ అలాగే వెనక్కి తీస్కెళ్లి వంటింటి గట్టుపైపెట్టి — మంచంపై బోర్లా పడుకుంది — వెక్కిళ్లతో ఎగిసిపడ్తున్న — గుండెల్ని కంట్రోల్ చేసుకోలేక—

ఇదివరకైతే తనకు తనై ఎప్పుడైనా భర్తపై విసుక్కున్నా — తనను ప్రసన్నం చేసుకునేందుకై — పెళ్లాం వెనుకెనుకే తిరుగుతూ — గడ్డం పుచ్చుకుని బతిమాల్తూ — ముద్దుల్తో మురిపిస్తూ ఆమెని శాంతింపజేయడానికి మరెన్నో "ప్రక్రియలు" చేసేవాడు.

సరిగ్గా... ఇప్పుడు కూడా... తప్పైపోయిందని — ఏదో ఆఫీసులో టెన్షన్స్ గుర్తొచ్చి అలా నోరు జారానని — తన దగ్గరకు — ఇదివరకులా అందిన చోటల్లా ముద్దుల్తో ముంచెత్తి ప్రసన్నం చేసుకుంటాడేమో ననుకుంటున్న ... ఆమె ఆశ అడియాసైపోయింది — మొగుడు ఎంతకీ రాకపోవడంతో

సుబ్బారావు మాత్రం... నుంచుని .. నించుని కాళ్ల పీక్కుపోతున్నా — అలాగే నించునివున్నాడు.

ఈ కోతి మొహం పెళ్లాం ఆ సమయంలో రాకపోయుంటే — తనతో ఆమె ఏం మాట్లాడేది?

"నా మొగుడు చాతకాని చవటాయ్. అందుకే మిమ్మల్ని చూసి నవ్వాను... నన్ను సుఖపెట్టే మగాడు మీరే గనక."

కాబట్టి వెంటనే, మీ భార్యని — కొన్నాళ్లపాటు పుట్టింటికి పంపి — నాల్గురోజులు లీవ్ పెట్టి ఇంట్లో కూర్చున్నారంటే — నా మొగుడు ఆఫీస్‌కెళ్లగానే ఈ దొడ్డి తలుపుగుండా మనిద్దరం ఒకటైపోవచ్చు — కసికసిగా... ఆపై వూహించుకోలేకపోయాడు. అప్పటికే వొళ్లంతా సలసలమని మరుగుతూ — వేడెక్కిపోవడంతో—

ప్రక్కింటి అపర్ణ — ఇద్దరు బిడ్డల తల్లి! చక్కగా, బొద్దుగా, ముద్దుగా వుంటంతో — ఇప్పటికిప్పుడే పీటలపై కూర్చోబెట్టి మళ్లీ పెళ్లి చెయ్యొచ్చు అనేలా... అందంగా వుంటుంది.

ఫ్రెష్‌గా పిటపిటలాడే... ఆమె సొంకాన్ని చూస్తుంటే... ఏ మగాడైనా రెప్పార్పలేడన్న సంగతి... ఇప్పుడే... ఆమె తనను చూసి నవ్వినప్పుడే పసిగట్టాడు — అపర్ణలోని ఆకర్షణ్ని

తన పెళ్లామూ వుంది — తిండీ, తిప్పలు లేనట్లు ఎటు గాలేస్తే అటూగిపోతున్న స్కెలిటన్‌లా.

పెరటి చెట్టు వైద్యానికి పనికి రాదన్నట్లు — ఇన్నాళ్ళూ ప్రక్కింటామెకి లైనెయ్యాలన్న సంగతే తనకు తట్టనందుకు, ఆమె నవ్విందాకాగానీ తన తలలో ట్యూబ్‌లైటు వెల్గనందుకు ... తన మట్టిబుర్రపై నాలుగు మొట్టుకున్నాడు... పిడికిలి బిగించి.

ఆఫీస్‌కి టైమైపోవడంతో — ఇంట్లోకొచ్చి స్నానం చేసి గబగబ డ్రస్ వేసుకుని పెళ్లాం ముక్కుచీదుతూ పెట్టిన టిఫినైనా తినక ఆఫీస్‌కెళ్లాడన్న మాటేగానీ, మనసంతా అపర్ణపైనే —వాకోసం పెరట్లో... ఎదురు తెన్నులు కాస్తుందా అభిసారికలా!

ఇహ ఒక్క క్షణమైనా ఆఫీస్‌లో కూర్చోబుద్ధి కాలేదు. తను వాడుకోని లీవులు బోలెడున్నాయి గనుక — వెంటనే ఓ నాల్గురోజులు లీవ్ పెట్టి — హుషారుగా ఈల వేసుకుంటూ — ఇంటిదారి పట్టాడు—

భర్తని అల్లంత దూరంనుండే చూసిన విశాలలో సంతోషం పొంగిపొర్లింది....

పెళ్లయినప్పటినుండీ — ఎప్పుడూ తనని కోప్పడని భర్త —

ఈరోజు... కసురుకోవడం— ఆఫీసులో కూడా కూర్చోలేక మదనపడ్తూ తనను బుజ్జగించి, ఏ సిన్మాకో, షికారుకో తీస్కెళ్లడానికి వస్తున్నారనుకుంటూ — అతడి రాకను పసిగట్టనట్టు... వంటింట్లో స్టౌ వైపుకి తిరిగి పని చేసుకుంటున్నట్లు నటించసాగింది. ఎలాగూ... భర్త వెనుక మాటువ — తనను లటుక్కున వాటేసుకుంటాడని!

కానీ! సుబ్బారావు (డెస్సైనా మార్చకుండా — విశాలను దాటుకుంటూ — పెరట్లోకెళ్లాడు

ఆ రాత్రి... అపర్ణ పొందులోని హాయిని అనుభవించాలనే తహతహలో ... అన్నం సహించక అటూ.. ఇటూ కెలుకుతూ—

"నువ్వు కొన్నాళ్లపాటు, పాపని తీస్కుని పుట్టింటికెళ్ల రాదూ! అన్నాడు నేల చూపులు చూస్తూ— నెత్తిన బాంబు పడ్డట్టు బిత్తరపోయిందా మాటతో — విశాల.

ఎంచేతంటే భర్తకు హోటల్ తిండి పడదు.. రాత్రిళ్లు... మంచం పై నన్ను ఆక్రమించుకోందే... కన్నెప్ప మూతపడదు గనక.

అందుకే ... మొదటి కాన్పుకి కూడా పుట్టింటికెళ్లకుండా ఇక్కడే పురుడు పోసుకుంది—

వూర్లో ఏ శుభకార్యం జరిగినా— ఇద్దరూ వెళ్లి వెంటనే వచ్చేవాళ్లే గానీ — ఎంత బ్రతిమాలినా నన్నొక్కదాన్ని వదలని భర్త... ఈనాడు... అంత తేలిగ్గా వెళ్లరాదూ.

అనేసరికే ... కర్రిలా బిగుసుకుపోతూ... ఎందుకూ! అనకుండా వుండలేకపోయింది—

"పాపకు సెలవులే కదా! అందునా రోజూ నీ ఏడ్పు ముఖం చూడలేక చచ్చిపోతున్నా కూడా— విసుగ్గా అంటూ — అన్నం గిన్నెలో చేతులు కడిగేసుకుని వెళ్తున్న భర్త వైఖరికి ... చీర కొంగును నోట్లో కుక్కుకుంది.

ఆ ప్రొద్దున్నే బట్టలు సర్దుకుంది — తినగ తినగ తీపైనా వెగటు పుడ్తుంది—

ఎప్పుడూ కళ్ల ముందుండే సరికి — కాని దాన్నైపోయాను అనుకుంటూ — మంచంపైనుండి లేవగానే — పెట్టే బేడా సర్ది ఓ మూలన పెట్టి వుంటంతో — యమా! అంటూ ఆనందంతో ఎగిరి గంతేయాలనుకున్నాడు—

ఇక అపర్ణతో ప్రతీ ఘడియా మధురమైనదే!

ఆ రాత్రంతా విశాల నిద్రపోలేదన్నందుకు సాక్షిగా కళ్లు ఎర్రిగా వాచిపోయి వున్నాయన్న సంగతి కూడా పట్టించుకోక — త్వరత్వరగా డ్రెస్ చేసుకుని — సూట్‌కేసూ, బ్యాగూ బయటపెట్టాడు— ఇంటికి తాళం వేసేందుకు.



విశాల ప్రక్కింటి అపర్ణతో మాట్లాడుతోంది—

"వూరెళ్తున్నానండీ! కాస్త ఇల్లును గమనిస్తూ వుండండి—

"భలేవారే! అంతగా చెప్పాలా."

"నిజమే! అమ్మా వాళ్లని చూడాలనిపించింది... అలాగే వడియాలూ, పచ్చళ్లు కూడా పట్టుకొద్దామని!" అంటూ నసిగింది విశాల, ఏం చెప్పాలో తెలీక!

"అదా సంగతి! మీరు పెట్టలేదేందుకా! అనుకున్నా సుమండీ.

ఇక్కడేమో, ఈ కోతులతో పడతాం కదా! మా వారేమో! క్యాంపెళ్తారాయె; అందుకే అన్నయ్యగార్తో చెప్దాం... ఆఫీసుకెళ్లే ఆ కాసేపూ కాస్త గమనిస్తూ వుండమనీ! అందామనుకున్నా గానీ... అలా అంటే ఏమనుకుంటారేమోనని వూర్కున్నా! కానీ! అన్నయ్యగారు నా మనసులో మాట పసిగట్టారేమో! ఏమోగానీ! ఈ నాల్గు రోజులు ఎండని కూడా అనుకోకుండా పెరట్లోనే వుంటూ వడియాల కాపలా...!"

మ్రాన్పడిపోయాడా మాటలకి— సుబ్బారావు— చేతిలోంచి జారిపోతున్న తాళం గుత్తిని సైతం పట్టించుకోక!

* *